

ఆశల సాగులో అన్నదాత బిజీ 2



నగరంలో దొంగల హల్‌చల్ 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## సాగు పనులు ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు..



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. తహశీల్దార్ రాజశేఖర్‌కు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా శివపూర్ రైతులు వినతిపత్రం సమర్పించారు. తాము కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను దున్ననివ్వకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటూ హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 51లో ఉన్న తమ సాగు భూములకు గతంలోనే పట్టాలు ఉన్నాయని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, ట్రెయినీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లా అధికారుల, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్సీవోలు తనిఖీలు చేయాలని ఆదేశించారు.

# మోగిన బడిగంట




నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి) పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

**అక్షరటుడే, ఇందూరు:** వేసవి సెలవుల అనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆయా పాఠశాలల యాజమాన్యాలు పూర్తి ఏర్పాట్లు చేశాయి. దాదాపు రెండు నెలల సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు స్కూళ్లకు వెళ్లారు. ఇన్నాళ్లు తమ ఇళ్లల్లో ఆడిపాడిన చిన్నారులు.. పాఠశాలల్లో తమ స్నేహితులను కలుసుకునేందుకు ఉత్సాహం చూపారు. ఉదయాన్నే సమయానికి బడులకు చేరుకున్నారు. మొదటి రోజు నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. అయితే పాఠశాలల పునఃప్రారంభానికి అమావాస్య కొద్దిమేర ఎఫెక్ట్ చూపించింది. చాలావరకు ప్రైవేట్ పాఠశాలల్లో అమావాస్య కారణంగా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేదు. కొత్త అడ్మిషన్లు కూడా జరగలేదు. ప్రభుత్వ పాఠశాల్లోనూ హాజరు అంతంతమాత్రంగానే కనిపించింది. రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు పాఠశాలలకు హాజరవుతారని విద్యాశాఖ అధికారి తెలిపారు.









## విద్యుత్ కోతలతో అవస్థలు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో విద్యుత్ కోతలు ప్రజలను వేధిస్తున్నాయి. వేళాపాళా లేని కోతల కారణంగా చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా అవస్థలు పడుతున్నారు. నగరంలోని పలు డివిజన్లలో ఉదయం, సాయంత్రం అని తేడా లేకుండా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రివేళల్లో కరెంట్ కోతల కారణంగా ఉక్కపోతతో అవస్థలు పడుతున్నామని వారంటున్నారు. ఓవైపు గాలివాన.. మరోవైపు విద్యుత్ లేక నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 27 డివిజన్‌లోని సీతారాంనగర్ కాలనీలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లలోనే పవర్ కట్ అవుతుండడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



## స్కూల్ బస్సులు తనిఖీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉమ్మడిజిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో రవాణా శాఖ పాఠశాల బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల ఆదేశాల మేరకు డీటీవో రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో అధికారులు నగరంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. స్కూల్ బస్సులు ఫిట్‌గా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. బస్సు డ్రైవర్ల లైసెన్స్‌లు, వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం డీటీవో మాట్లాడుతూ.. చిన్నారులతో వెళ్లే బస్సులను వేగంగా నడపవద్దని సూచించారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు.. దిగేటప్పుడు అనుక్షణం డ్రైవర్లు గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులు ఎట్టిపరిస్థితుల్లో రోడ్డు ఎక్కవద్దని హెచ్చరించారు. తనిఖీల్లో ఎంవీఐలు, ఏఎంవీఐలు తదితరులు పాల్గొన్నారు.

### ఉమ్మడి జిల్లాలో ఎనిమిది స్కూల్ బస్సులు సీజ్..

డీటీసీ దుర్గాప్రమీల మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 112 బస్సులను తనిఖీలు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఎనిమిది బస్సులను సీజ్ చేశామని తెలిపారు. ఫిట్‌నెస్ లేని బస్సులు వెంటనే ఫిట్‌నెస్ చేయించుకోవాలన్నారు. నిబంధనలు పాటించకపోతే ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సైబర్ నేరాలపై అప్రమమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సూచించారు. మన కాలనీ – మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని జీవన్ రెడ్డి మాల్‌లో ఫైర్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమ నిబంధనలు, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

## యూరియా యాప్ రద్దు చేయాలి



**అక్షరటుడే, నందిపేట్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నందిపేటలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా యాప్ వాడడం తెలియక ఆందోళనలో ఉన్న రైతులు అటు సాగుకు సైతం పూర్తిగా సమయం వెచ్చించలేకపోతున్నారని పేర్కొన్నారు. యాప్‌లో యూరియా బుక్ చేసిన అనంతరం రోజుల తరబడి సొసైటీలు, ప్యాక్స్ సెంటర్ల వద్ద వేచి ఉండాల్సి వస్తుందని.. దీంతో సాగు పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. చదువురాని, స్మార్ట్ ఫోన్లు లేని రైతులు అనేకమంది ఉన్నారని వారికి స్మార్ట్ ఫోన్లలో యూరియాను ఎలా బుక్ చేసుకోవాలో తెలియదన్నారు. ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం సబబు కాదని.. వెంటనే యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోని యూరియాను సరఫరా చేయాలని కోరారు. ధర్నాలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, నందిపేట్, డొంకేశ్వర్ మండల రైతులు పాల్గొన్నారు.

## ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. పట్టణంలోని బుర్రమత్తడి ప్రాంతంలో సోమవారం బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బుర్ర మత్తడి ప్రాంతంలో ఉన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని బోరు తవ్వకం చేపట్టినట్లు తెలిపారు. త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్లు, డీఈ హన్మంతరావు, ఏఈ వేణు ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'యూరియా యాప్ పనికిమాలినది'



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ పనికిమాలిందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాప్ పేరుతో రైతులను కష్టాల పాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా యాప్ ఒక పనికిమాలిన చర్య అని.. పాత పద్ధతిలోనే యురియాను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేశాఖ విడుదల చేసి పరిశీలించి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. అయితే దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని వివరించారు. వరుసగా 12 ఏళ్లు ప్రధాని పదవిలో ఉన్న మొదటి వ్యక్తి నరేంద్ర మోదీ అని అన్నారు. భారతదేశాన్ని ఎకనామికల్ సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడంలో ఆయన ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మోదీ నాయకత్వంలో జాతీయ రహదారులు, మెట్రో రైల్స్, ఎయిర్‌పోర్టులు ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. ఆయన సారథ్యంలో దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తి కల్పించారని స్పష్టం చేశారు. 16 కోట్ల ఇళ్లకు జల్‌జీవన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకే సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించాయి. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేశారు. జిల్లావ్యాప్తంగా అనుమతి లేని పాఠశాలలు ఉన్నాయని విద్యాశాఖకు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోవడంలేదని సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖలో స్పందన లేదన్నారు. చట్టప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో క్యాపిటల్ ఫీజులు తీసుకోవద్దని.. అధిక ఫీజులు వసూలు చేయవద్దని ఉన్నప్పటికీ నిబంధనలో పాటించట్లేదన్నారు. వెంటనే ప్రైవేట్ యాజమాన్యాలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు సంఘాల నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ, డీఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## రక్తదాన ప్రోత్సాహకులకు అభినందన



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సమాజసేవ చేస్తున్న రక్తదాన ప్రోత్సాహకులను కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఎక్కువ మందిని రక్తదానానికి ప్రోత్సహించిన జిల్లా రెవెన్యూ అసోసియేషన్‌ను రాష్ట్రపతి శివప్రతాప్ శుక్లా అభినందించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి తరపున కార్యదర్శి ప్రశాంత్ అవార్డును అందుకున్నారు. అలాగే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి తోట రాజశేఖర్‌ను సైతం గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం వారు కలెక్టర్ ఇలాత్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరిని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరాయంగా రక్తం అందుబాటులో ఉండేందుకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలను నిర్వహించాలని సూచించారు. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయాగౌడ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, జిల్లా కార్యదర్శి గోక అరుణ్ బాబు, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, పీఆర్‌వో బొద్దుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఆడియోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** తన పేరుతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ పేరును వాడుకుంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో నకిలీదని కాంగ్రెస్ పోసానిపేట సీనియర్ కార్యకర్త గీరెడ్డి మహేందర్ రెడ్డి అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం కామారెడ్డి డీఎస్పీతో పాటు పట్టణ సీఐకి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 40ఏళ్లుగా కాంగ్రెస్‌లో వివిధ పదవులు నిర్వహించిన తాను షబ్బీర్ అలీతో ఎలాంటి ఫోన్ సంభాషణ జరపలేదని స్పష్టం చేశారు. అయితే జూన్ 12 రాత్రి నుంచి కొందరు వ్యక్తులు తామిద్దరం ఫోన్‌లో మాట్లాడినట్లు, కాంగ్రెస్ నేతలను విమర్శించినట్లు, మహిళలపై అసభ్యకరంగా మాట్లాడినట్లు నకిలీ ఆడియో సృష్టించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



## ఆశల సాగులో

# అన్నదాత బిజీ..



**నైరుతి రుతుపవనాల ఆగమనంతో అన్నదాతలు ఖరీఫ్ సాగులో బిజీ అయ్యారు. ఉమ్మడిజిల్లాలోని పలుచోట్ల ఇప్పటికే నాట్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల నార్లు పోస్తున్నారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడంతో పల్లెల్లో సందడి నెలకొంది.**

**– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్**







## డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 13 మందికి జైలు శిక్ష

**అక్షరటుడే, కామారెడ్డి :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీసులు విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 193 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. రూ.2,07,300 జరిమానా విధించింది. వీరిలో 10 మందికి ఒక రోజు జైలు శిక్ష, మరో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష వేసింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడం చట్టం ఉల్లంఘనే కాదు, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయడమేనన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మున్సిపాలిటీ 6వ వార్డులోని ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి కౌన్సిలర్ గఫార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అనంతరం జరిగిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థుల హాజరు, చదువు, స్కూల్ అభివృద్ధిపై చర్చించారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కౌన్సిలర్ సూచించారు. వార్డులో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. స్కూల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాల అందజేత



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సర్పంచ్ అత్యం శ్రీనివాస్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అల్పాహారం, దుస్తుల పంపిణీ ప్రభుత్వం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వసుధ, కార్యదర్శి రవి, సీఆర్పీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణికి 16 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని సీపీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 16 ఫిర్యాదులు అందాయి. అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాశ్ ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం అదనపు డీసీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ సిబ్బందికి సూచించామన్నారు. ప్రజలు నిర్భయంగా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలన్నారు.

## నగరంలో ఘనంగా ‘యోగా వాక్’

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలిటెక్నిక్ మైదానంలో ‘యోగా వాక్’ ర్యాలీని అడిషనల్ కలెక్టర్ కిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఆదివారం జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయుష్ యోగా నోడల్ అధికారి డాక్టర్ జె. గంగాదాస్ మాట్లాడుతూ.. ఈనెల 18న సుభాష్‌నగర్‌లోని దయానంద యోగా కేంద్రంలో యోగా విన్యాసాల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ రమేష్, ఆయుష్ డీపీఎం వందన, సీనియర్ వైద్యులు ఫసియొద్దిన్, శ్రీవాణి, తిరుపతి, యోగా అసోసియేషన్ ప్రతినిధులు రామచందర్, సిద్ధిరాములు, ఆర్యసమాజ్ విజయ్ ఆర్య, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి తోట రాజశేఖర్, ఆయుష్ ఫార్మసిస్టులు ఎన్ పురుషోత్తం, ఉమా ప్రసాద్ యోగా శిక్షకులు సీనియర్ సిటిజన్స్ వాకర్స్ వినోద్ కుమార్, నేలం సత్యనారాయణ, బాబురావు, సురేష్ పాల్గొన్నారు.






## ఎస్సై అనిల్‌రెడ్డికి సన్మానం

**అక్షరటుడే, ఆర్మూర్ :** మాక్లూర్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్సై అనిల్ రెడ్డిని చిన్నపూర్ సర్పంచ్ చిన్నా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ యువజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్సైని ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధితో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు తమవంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. నూతన ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నవీన్, హరీష్, వేణు, గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బార్‌లో పోలీసుల తనిఖీలు



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) పరిధిలోని ఎంఎస్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం డాగ్ స్క్వాడ్‌తో ఎస్సై ఆరిఫ్ బార్ పరిసరాలను, పక్కనే ఉన్న పాన్‌షాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించకూడదని బార్ యాజమాన్యానికి సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు అకస్మాత్తుగా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టడంతో బార్ నిర్వాహకులు కంగుతిన్నారు.

## పరిశుభ్రత పాటించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ సూచించారు. నగరంలోని వివిధ కాలనీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రదతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు డివిజన్‌లలో మున్సిపల్ కార్పొరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.



## పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే షిండే..

**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని విఠల్‌వాడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రామ్‌దాస్ పటేల్ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ శాసనసభ్యుడు హన్మంత్ షిండే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాందాస్ పటేల్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాడె మోశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాం దాస్ పటేల్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు.

## ఐలాపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ఐలాపూర్ గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని లింగంపేట విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కమ్మరి సిద్ధిరాములు చారి ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పండరి చారి, అధ్యక్షుడిగా కమ్మరి చంద్రశేఖర్ చారి, ప్రధాన కార్యదర్శిగా వడ్ల అంజయ్య చారి, కోశాధికారి కమ్మరి భాస్కర్ చారి ఎన్నికయ్యారు. సభ్యులుగా కమ్మరి వెంకటేశం చారి, వడ్ల పండరిచారి, వడ్ల సోమయ్య చారి, వడ్ల వీరేశం చారి, కమ్మరి శంకర్ చారి, వడ్ల కిష్టయ్య చారి, కమ్మరి పరువయ్యా చారి, కమ్మరి కృష్ణ చారి, వడ్ల రాజు చారి కమ్మరి నాగభూషణం చారిలను ఎన్నుకున్నారు.

## బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రంలో నాయకులు బీఆర్ఎస్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే సామాజిక సేవా కార్యకర్త, బీఆర్ఎస్ నాయకుడు ఎంఏ హకీం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు జుబేర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు సేవ చేస్తున్న వ్యక్తి హకీం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, నవీన్, నాయకులు తెల్ల రవికుమార్, సాయన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం, బీఆర్ఎస్ నాయకులు అరిఫ్, సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కన్నకొడుకే హింసిస్తున్నాడు.. కాపాడాలని తల్లిదండ్రుల వినతి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** తమ కన్నకొడుకే తమను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని వృద్ధ తల్లిదండ్రులు వాపోయారు. నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వారు తమ కొడుకుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కొండ్లెపు చిన్న బాలయ్య, రాధ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమకు ఇద్దరు కొడుకులు ఉన్నారని.. రెండో కొడుకు కొండ్లెపు శంకర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా వేల్పూర్ మండలం పడిగెల్ గ్రామంలో పనిచేస్తున్నాడన్నారు. కొన్ని రోజులుగా తమను మానసికంగా వేధిస్తున్నాడని.. తమకు మాయమాటలు చెప్పి తమ ఇంటిని శంకర్ వదిన కొండ్లెపు విజయ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. అలాగే రూ.6.5లక్షలను శంకర్ దగ్గర గతంలో ఉంచామని.. ఇప్పుడు ఆ డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడన్నారు. ఇటీవల మా ఇద్దరిని బంధించి చిత్రహింసలకు గురి చేశాడని వృద్ధ దంపతులు వాపోయారు. డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఈ విషయమై మార్చి 16న సీపీ సాయి చైతన్యకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పటినుంచి ‘నా పైనే ఫిర్యాదు చేస్తారా.. మీ అంతు చూస్తా’నంటూ మమ్మల్ని మరింతగా వేధిస్తున్నాడని.. చిత్రహింసలకు గురి చేస్తున్నారని వారు రోదిస్తూ వివరించారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ వేల్పూర్ పోలీసులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## నగరంలో దొంగల హల్‌చల్.. భారత్ గ్యాస్ ఏజెన్సీలో చోరీ..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో వరుస చోరీలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు తేడా లేకుండా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దోపిడీలకు పాల్పడుతున్నారు. వన్ టౌన్ ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్ గార్డెన్ సమీపంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ లో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ముందుగా తాళాలు పగులగొట్టిన అనంతరం సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కట్ చేశారు. అనంతరం లోపలికి వెళ్లి లాకర్‌ను ధ్వంసం చేశారు. సుమారు రూ.70వేలు చోరీకి గురైనట్లు ఏజెన్సీ నిర్వాహకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీం ప్రతినిధులు సంఘటనాస్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.